క్లుప్తంగా

ఘనంగా కుంతీదేవి జాతర



ఆర్‌బీ పట్నంలో కుంతీదేవికి పూజలు చేస్తున్న భక్తులు

పెద్దాపురం: మండలంలోని రాయభూపాలపట్నం గ్రామంలో ప్రతి ఏడేళ్లకు ఒకసారి నిర్వహించే కుంతీదేవి అమ్మవారి జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జాతర నిర్వహించగా వేకువ జాము నుంచి నిమ్మల పూడి రాజు, తులసమ్మ దంపతులచే అమ్మవారికి అభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. వెల్ల, వేళంగి, ఎదురుపాక, రాజుపాలెం, గొల్లపాలెం వారిచే గారడీ, వేట్లపాలెం వారిచే పెద్ద ఎత్తున బాణసంచా పోటీలు నిర్వహించారు. కేరళ వాయిద్యాలు, ఆర్కెస్ట్రా, మ్యూజికల్ బ్యాండ్ వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాన్ని నిర్వహించారు. నొక్క బేబి, తోటాడ అప్పారావు, ఉండు వెంకటరత్నం, వడ్లపాటు చిట్టిబాబు, పచ్చిపాల ఏసుబాబు, నక్కా లాజరు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ



అమీనాబాద్‌లో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ రాజబాబు

కొత్తపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ రాజబాబు సూచించారు. మండలంలోని అమీనాబాద్‌లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకు 5500 మంది కూలీలకు పని కల్పిస్తున్నామన్నారు. వేసవి నేపథ్యంలో కూలీలు ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకూ పని చేస్తున్నారని చెప్పారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 4.28 లక్షల పనిదినాలే లక్ష్యమన్నారు. ఇప్పటికే సుమారు 95 వేల పనిదినాలు కల్పించామన్నారు. గ్రామాల్లో పని అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తున్నట్టు చెప్పారు. పలువురు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

18న నేరెళ్లమ్మతల్లి జాతర



కొత్తపల్లి: మండలంలో కొమరగిరిలో వేంచేసిన నేరెళ్లమ్మతల్లి జాతర ఈ నెల 18న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. జాతర సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. 19న అమ్మవారి తీర్థం జరుగుతుందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

రైలు ఎక్కుతూ జారిపడిన యువకుడు



రైలు నుంచి జారిపడిన యువకుడు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కుతూ ఒక యువకుడు జారి పడిపోయాడు. స్థానికులు, రైల్వే పోలీసుల కథనం ప్రకారం హౌరా నుంచి యశ్వంత్‌పూర్ వెళ్తున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం మధ్యాహ్నం 3.12 నిమిషాలకు మూడో నెంబరు ప్లాట్‌ఫాంకు వచ్చింది. 3.14కు బయలు దేరేందుకు రైలుకు సిగ్నల్ ఇవ్వడంతో తాగునీటి కోసం రైలు దిగిన ప్రయాణికుడు ఎక్కే హడావిడిలో జారి పడిపోయాడు. రైలులో ప్రయాణికులు చైన్ లాగడంతో అతడికి ప్రమాదం తప్పింది. గార్డు అతడిని రక్షించి బోగి ఎక్కించడంతో 3.20కి రైలు బయలు దేరింది. యువకుని వివరాలు సేకరించలేకపోయినట్టు స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

కాకినాడ సిటీ: డీ1 సెక్షన్ 33/11 కేవీ ఆనందభారతి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ సినిమా రోడ్డు ఫీడర్‌పై వార్షిక మరమ్మతులు నిర్వహిస్తున్న దృష్ట్యా ఆదివారం ఉదయం 7 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ జి.ప్రసాద్ శుక్రవారం సాయంత్రం తెలిపారు. సినిమారోడ్డు శేషఖగల్లీ, పోలీస్‌లైన్, బ్యాంక్‌పేట, జయా రెసిడెన్సీ వీధి, శ్రీకాం ప్లెక్స్ వీధి, కల్పన సెంటర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని ఈఈ తెలిపారు.

కార్పొరేట్‌తో సర్కార్ సవాల్

- ప్రైవేటు కళాశాలలకు దీటుగా ఉత్తీర్ణత
- తక్కువ రుసుముతో ఉత్తమ విద్యా బోధన
- వొకేషనల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



సామర్లకోటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

సామర్లకోట: కార్పొరేట్ చదువులు రాకముందు ఎన్నో తరాలుగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యను అభ్యసించి ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించారు. కొన్ని కళాశాలల వల్ల విద్యార్థులకు, కొందరు విద్యార్థుల వల్ల కళాశాలలు పరస్పరం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేవి. అటువంటిదే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల. తక్కువ ఫీజులతో ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించేలా విద్యా బోధన సాగుతోంది. ఇటీవలి ఇంటర్ ఫలితాల్లో 52 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 1972లో సుమారు 25 ఎకరాల విశాలమైన ఆట స్థలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారు. అప్పట్లో ప్రైవేటు కళాశాలలు అంతగా లేకపోవడంతో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరడానికి మక్కువ చూపేవారు. ఈ కళాశాలలో చదివిన అనేక మంది మంచి స్థాయిలో ఉన్నారు. ఈ కళాశాలలో సీటు సాధించడానికి సిఫార్సులు కావలసి వచ్చేది. అయితే నేడు ప్రైవేటు కళాశాలలు పుట్ట గొడుగుల్లా ఏర్పాటు కావడంతో ఈ కళాశాలకు డిమాండ్ తగ్గింది. వసతులు లేకపోయినా ప్రైవేటు కళాశాలలకు అనుమతులు రావడాన్ని పలువురు ప్రశ్నిస్తున్నారు.

వొకేషనల్ కోర్సులకు అవకాశం..

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వొకేషనల్ కోర్సులు ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, ఫ్యాషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (మహిళల) కోర్సులతో పాటు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులు ఇంగ్లీషు, తెలుగు మీడియంలో బోధన జరుగుతోంది. సైన్స్ కోర్సులకు ఏడాదికి రూ.2,185, ఆర్ట్సుకు ఏడాదికి రూ.1,297, వొకేషనల్‌కు ఏడాదికి రూ.2,434 అన్ని ఫీజులతో కలిపి ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది.

2022-23 విద్యా సంవత్సరంలో డీఆర్‌ఆర్ఎస్ఎస్ ప్రశాంత్ 969 మార్కులు, కె.మల్లికాదేవి 950 మార్కులు, ఎ.రజని 939, టి.బంగారం 901 మార్కులు సాధించారు. దాంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరడానికి విద్యార్థులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ కళాశాలలో విశాలమైన ఆట స్థలంతో పాటు, కబడ్డీ, ఖోఖో, బాస్కెట్ బాల్ కోర్టులు ఉన్నాయి.

15 నుంచి ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం..

పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఇంటర్‌లో చేరడానికి ఈ నెల 15 నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దరఖాస్తులు ఇస్తున్నారు. జూన్ 14వ తేదీ లోపుగా దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుంది. జూన్ ఒకటి నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి. ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరడానికి కళాశాలను బట్టి రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



మంచి విద్యాబోధన చేస్తున్న అధ్యాపకులతో ఉన్న కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు పనుల్లో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.కోటి మంజూరు చేసింది. పూర్వపు విద్యార్థిగా కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుంది.

– ఊబా జాన్ మోజెస్, మున్సిపల్ వైస్ చైర్మన్, సామర్లకోట

మంచి సదుపాయాలు..



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంచి సదుపాయాలు ఉన్నాయి. మంచి ల్యాబ్‌లు ఉన్నాయి. ఇటీవలి ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. ఈ నెల 15 నుంచి దరఖాస్తులు విక్రయించనున్నాం. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– టి. శ్రీరామమూర్తి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, సామర్లకోట

పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు

ప్రత్తిపాడు: సారా కేసులో పరారీలో ఉన్న నిందితుడిని ప్రత్తిపాడు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే...పిఠాపురం మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన వేమగిరి సాయిబాబు మార్చి 14న ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో జరిగిన సారా కేసులో నిందితుడు. అప్పట్లో పోలీసుల కళ్లుగప్పి అతడు పరారయ్యాడు. నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి, స్థానిక కోర్టులో హాజరు పరిచారు. ఎస్సై ఎం.పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీబీఎస్ఈలో కేంద్రీయ విద్యాలయం శతశాతం ఉత్తీర్ణత

కాకినాడ రూరల్: మండలం వలసపాకలలోని కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారు. 48 మంది విద్యార్థులు పరీక్షలు రాసి అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా విద్యాలయ ప్రిన్సిపాల్ బొంత శేఖర్ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అభినందించారు.

ఆన్ ది జాబ్ ట్రైనింగ్‌పై అవగాహన

కాకినాడ సిటీ: డిగ్రీ విద్యార్థులకు నిర్వహిస్తున్న ఇంటర్న్‌షిప్‌కు 150 మంది డీసీసీబీ బ్యాంక్‌లో ఆన్ ది జాబ్ ట్రైనింగ్‌కు ఎంపికైనట్లు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వికాస కార్యాలయం బెన్నెట్ క్లబ్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వికాస ద్వారా ప్రముఖ కంపెనీల్లో విద్యార్థులను ట్రైనింగ్‌కు పంపినట్లు తెలిపారు. జిల్లాలోని డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు ట్రైనింగ్‌పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ బ్యాంకు సీఈవో నరసింహారావు, వికాస మేనేజర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిబిరం



మ్యూజిక్‌పై సూచనలిస్తున్న బుద్దా శ్రీనివాస్



చిన్నారులతో గ్రంథాలయాధికారి రత్నమణి

పెద్దాపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శుక్రవారం తెలుగు పద్యాలు, కథలు, పుస్తక సమీక్ష తదితర అంశాలపై సుమారు 30 మంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, సిబ్బంది సింగం బుల్లియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో శుక్రవారం ప్రముఖ ఇంద్రజాలికుడు బుద్దా శ్రీనివాస్ విద్యార్థులకు ఇంద్రజాలంలో చిట్కాలపై అవగాహన కల్పించారు. శిబిరం సమన్వయకర్త కూనిరెడ్డి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాంప్‌లో జేవీవీ నాయకులు, ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు సుమారు 130 మంది విద్యార్థులు ఎన్నో విషయాలు తెలుసుకున్నారు. కూనిరెడ్డి అరుణ, అమృత, నమ్రత తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తిగా వేసవి శిబిరాలు

సామర్లకోట: స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాలు ఆసక్తిగా సాగుతున్నాయి. విద్యార్థుల్లో పుస్తక పఠనంపై శ్రద్ధ పెంచడానికి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయాలల్లో విద్యార్థులకు వేసవి శిబిరాలు ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా ఐదో రోజు విద్యార్థులకు కథలు, పాటల పోటీలు నిర్వహించారు. దాంతో ఆసక్తికరంగా విద్యార్థులు పాల్గొంటున్నారు. గ్రంథాలయాధికారి బందిల రత్నమణి విద్యార్థులను ప్రోత్సహించేలా పాటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రకటించారు.

ముందస్తు నాట్లకు సిద్ధంకండి

- ఏడీఏ దైవకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ దైవకుమార్

పెద్దాపురం: పంటకాలంలో రైతులు ముందస్తుగా నాట్లు వేసుకోవాలని ఏడీఏ దైవకుమార్ అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఏఓ సంజయ్‌కుమార్ అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రానున్న ఖరీఫ్‌లో సన్న రకాలను సాగులోకి తీసుకువచ్చేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. మండలి సభ్యులు యినకొండ వీర విష్ణుచక్రం మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత సీజన్‌లో జరిగిన లోటుపాట్లను అధిగమించి ఉన్నత సేవలందించాలన్నారు. పశువైద్యాధికారి రాకేష్ మాట్లాడుతూ ప్రస్తుత వేసవి దృష్ట్యా పశువులను నీడలో ఉంచాలన్నారు. ఉదయం, సాయంత్రం చల్లటి నీటితో శుభ్రపరచాలన్నారు. సమీకృత దాణాపై అవగాహన కల్పించారు. అనంతరం పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాత, ఏఈఓ ప్రసాద్, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న గ్రేస్ ఆఫ్ గ్రాండ్ టెస్ట్ సంస్థ ప్రతినిధులు

కొత్తపల్లి: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిత సాధ్యమని గ్రేస్ ఆఫ్ గ్రాండ్ టెస్ట్ చైర్మన్ పుప్పాల విజయ్‌కుమార్ అన్నారు. గ్రామంలోని పేద విద్యార్థులకు శుక్రవారం గ్రేస్ ఆఫ్ గ్రాండ్ టెస్ట్ ఆధ్వర్యంలో బ్యాగులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా గత 25 సంవత్సరాలుగా అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నిరుపేద పిల్లలను గుర్తించేందుకు సుమారు 30 మంది సోషల్ వర్కర్లను నియమించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం డైరెక్టర్ విప్పర్తి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహితంగా జీవిద్దాం



లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్‌పై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

- కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: పర్యావరణహిత జీవన విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కోర్టు హాలులో శుక్రవారం లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ (లైఫ్)పై రెవెన్యూ, కాలుష్యం, మునిసిపల్, కార్మిక, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్లాస్గోలో జరిగిన కాప్-26 సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని, దీనిని విజయవంతంగా అమలు చేసేందుకు వివిధ శాఖల సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. ఆరోగ్యకర, సుస్థిర జీవితం కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ అనుకూల అలవాట్ల ప్రాముఖ్యతను ప్రజలు తెలుసుకునేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇంధనం, జల వనరుల సంరక్షణ, ఈ-వ్యర్థాలను తగ్గించడం, సుస్థిర ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడం వంటి వాటిపై ఈ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇన్‌ఛార్జి డీఆర్వో, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, సీపీవో పి.త్రినాథ్, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ఎస్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు హనుమాన్ శోభాయాత్ర

సామర్లకోట: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం శోభాయాత్ర నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు కర్రి ఆదినారాయణరెడ్డి, జీవీకే మోహనరావు పిలుపు నిచ్చారు. శుక్రవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద ర్యాలీని ఆర్ఎస్ఎస్ సద్భావన సదస్సు అధ్యక్షుడు ఓలేటి సత్యనారాయణ ప్రారంభిస్తారని తెలిపారు. మిరపకాయల వీధిలోని బాల ఆంజనేయస్వామి ఆలయం వద్ద ర్యాలీ ముగుస్తుందని చెప్పారు.

సత్కళావాహినిలో..

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో సత్య భాస్కర ప్రసన్నాంజనేయ స్వామి భజన మందిరంలో ఆదివారం ఉదయం పది గంటలకు హనుమాన్ జయంతి నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసులు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు తెలిపారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం చేస్తామని తెలిపారు.

సీఎం సాయం పంపిణీ

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన కేదారిశెట్టి మాధురికి సీఎం సహాయ నిధి రూ.1.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే కురసాల కన్నబాబు శుక్రవారం అందించారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, ఎంపీటీసీ ముద్దన వెంకట్రాజు సమక్షంలో లబ్ధిదారుకు కన్నబాబు చెక్కు అందజేసి, ప్రభుత్వ పరంగా అండగా ఉంటామన్నారు. వైద్య నిమిత్తం ఆపదలో ఆదుకుని ఆర్థికసాయం అందించిన సీఎం జగన్, ఎమ్మెల్యే కన్నబాబు, సర్పంచ్ సత్యనారాయణకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి జన్మనక్షత్ర పూజలు

కరప: మండలం యండమూరులో కొలువైన సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వెంకటేశ్వరస్వామివారి జన్మనక్షత్రం శ్రవణం కలియడంతో ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు పెద్దింటి సీతారామం, వేద పండితులతో కల్సి పూజలు చేశారు. ఈసందర్భంగా భక్తులతో వెంకటేశ్వరస్వామి వ్రతాలు నిర్వహించారు. సమీప గ్రామాల భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. కరప విష్వాలయంలోని వెంకటేశ్వరస్వామికి అర్చకుడు పెద్దింటి అనంతాచార్యులు, కూరాడ, పెనుగుదురు, గురజనాపల్లి, వేళంగి తదితర గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో కూడా స్వామివారికి జన్మనక్షత్ర పూజలు చేశారు.

విజ్ఞానదాయకంగా నేషనల్ ఫోరెన్సిక్ డే

కాకినాడ క్రైం: స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో నేషనల్ ఫోరెన్సిక్ డే విజ్ఞానదాయకంగా జరిగింది. హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఆర్ఎంసీ ఫోరెన్సిక్ డిపార్టుమెంట్‌లో జరిగిన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవి బహుమతులు, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. వైద్యులు మాట్లాడుతూ ఫోరెన్సిక్ మెడిసిన్ ఆవశ్యకతను వివరించారు. ఫోరెన్సిక్ వైద్యంలో ఆధునిక విధానాలను వివరించారు.

15న మండపేటలో ఐటీఐ అప్రెంటిస్ మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): మండపేట ఎస్‌వీపీఆర్ ఐటీఐలో 15వ తేదీన అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల వర్మ శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ, లేదా ప్రైవేట్ ఐటీఐలో ఫిట్టర్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు హాజరుకావచ్చని, ఇతర వివరాలకు 95738 92777 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

'నాడు-నేడు'తో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ



విద్యాకానుక కిట్లకు సంబంధించి రికార్డులను పరిశీలిస్తున్న ఆర్జేడీ నాగమణి

పిఠాపురం: మన బడి నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలు రూపు రేఖలు పూర్తిగా మారుతున్నాయని ఆర్జేడీ జి.నాగమణి అన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యాకానుక కిట్ల స్టోర్ రూమును శుక్రవారం ఆమె పరిశీలించారు. జగనన్న విద్యా కానుక కిట్లుకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే అన్ని మండలలాలకు కిట్లను పంపించి భద్రపరిచామని తెలిపారు. ఆమె వెంట మండల విద్యాశాఖాధికారి ఎస్.వెంకటేశ్వరావు తదితరులు ఉన్నారు.

నాణ్యమైన శిక్షణ ఇవ్వాలి

- ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణమోహన్



మాస్టర్ ట్రైనీలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణమోహన్

సామర్లకోట: పంచాయతీ కార్యదర్శులకు మాస్టర్ ట్రైనీలు నాణ్యతతో కూడిన శిక్షణను అందజేయాలని విస్తరణ శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఈ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలోని మాస్టర్ ట్రైనీలకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శుక్రవారం ముగిసింది. మాస్టర్ ట్రైనీలుగా వచ్చిన సీనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఈఓపీఆర్డీలు మాట్లాడుతూ గ్రామ పరిపాలనపై పూర్తి స్థాయిలో అవగాహన పెరిగే విధంగా శిక్షణ ఉండాలన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ ఆస్తులను రక్షించడంతో పాటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులు ఖర్చు చేసే విషయంలో అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో ఈటీసీ రిసోర్స్ పర్సన్లు పి.శ్రీనివాసరావు, కేఎస్సార్ నిహారిక, ఎంఎస్ఎన్ రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మాస్టర్ ట్రైనీలకు సర్టిఫికెట్లు అందజేశారు.

సాంకేతిక సమస్యలను అధిగమించాలి



ఆర్పీలకు శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ శ్రీనివాసరావు

సామర్లకోట: మహిళా సంఘాలను బలోపేతం చేయడంలో సాంకేతిక సమస్యలను శిక్షణతో అధిగమించాలని జిల్లా రీసోర్సు పర్సన్ దాసరి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సాంకేతిక శిక్షణ అభివృద్ధి కేంద్రం (టీటీడీసీ)లో మెప్మాలోని పెద్దాపురం మున్సిపాలిటీ రీసోర్సు పర్సన్లకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శుక్రవారంతో ముగిసింది. మెప్మా కార్యకలాపాలు, ప్రభుత్వ పథకాల అమలుపై ఆర్పీలకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకుని ప్రతి మహిళా సంఘం తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకునేలా చేయాలన్నారు. మహిళా సంఘాలకు చెందిన వివరాలను ఆన్‌లైన్ చేసే సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలను శిక్షణతో దూరం అవుతాయని తెలిపారు. మెప్మా డీపీఎంలు అనంత్, కె.మోహన్‌కుమార్ శిక్షణ ఇచ్చారు. 15, 16 తేదీలో సామర్లకోట నుంచి 43 మంది, 17, 18 తేదీల్లో తుని నుంచి 40 మంది, 19, 20 తేదీల్లో పిఠాపురం నుంచి 39 మంది, 22, 23 తేదీల్లో రామచంద్రపురం నుంచి 36 మంది మున్సిపాలిటీల నుంచి ఆర్పీలు శిక్షణకు వస్తారని, 24 నుంచి జూన్ ఒకటి వరకు కాకినాడ కార్పొరేషన్ నుంచి 209 మంది మెప్మా ఆర్పీలకు శిక్షణ ఉంటుందని డీపీఎం తెలిపారు.

22 వరకు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



కొంగోడులో డ్రెయిన్ల పక్క పెరిగిపోయిన గడ్డిమొక్కలను శుభ్రం చేస్తున్న కార్మికులు

కరప: మండల పరిధి గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు ఈ నెల 22వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. కరప, నడకుదురు, కూరాడ, వేములవాడ తదితర గ్రామాల్లో శుక్రవారం పర్యటించి, పారిశుధ్య పనులను పరిశీలించి, గ్రామ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. శుక్ర, శనివారాల్లో సీసీ డ్రెయిన్లు, కచ్చా డ్రెయిన్లలో పూడికతీసి, శుభ్రపరచి, నీరునిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఈ నెల 15, 16, 17 తేదీలలో డ్రెయిన్లలో యాంటీ లార్వా (దోమలమందు) పిచికారీ చేయించాలన్నారు. నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వదలాలన్నారు. సాయంత్రం ఫాగింగ్ చేయించాలన్నారు. నీరు నిల్వ ఉన్న కుంటలలో గంబుజియా చేపలను వదలాలన్నారు. 18, 19 తేదీలలో గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులు (ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు) అన్నీ శుభ్రంచేయించాలని, వాటర్ ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో, వీధికుళాయిల వద్ద శుభ్రం చేయించి, డ్రైడే పాటించాలన్నారు. ఈ నెల 20, 22 తేదీల్లో గ్రామపంచాయతీల పరిధిలో రోడ్ల వెంబడి చెత్తకుప్పలు తొలగించి, శుభ్రంగా ఉంచాలని ఈఓపీఆర్డీ సూచించారు.

నన్నయ వీసీ పద్మరాజుకు అభినందనలు



నన్నయ్య వీసీ పద్మరాజును అభినందిస్తున్న వర్సిటీ డైరెక్టర్ల బృందం

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొప్పిరెడ్డి పద్మరాజు వర్సిటీ వీసీగా నియమితులవడంపై ఆయనను డైరెక్టర్ల బృందం అభినందించింది. వర్సిటీ ఆడిటోరియంలో అభినందన సభ ప్రత్యేకంగా ఏర్పాటుచేసి గతంలో ఏపీపీఎస్సీ సభ్యులుగా నియమ, నిబద్ధతలతో సేవలందించారని, అదే స్ఫూర్తితో వర్సిటీకు సేవలు అందించాలన్నారు. అంతకు ముందు న్యాక్ బృందం పర్యటన విజయవంతం కావడంపై అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపి, ఈ నెల 31వ నిర్వహించే 9వ స్నాతకోత్సవం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ రమణ, రిజిస్ట్రార్ సుమలత పాల్గొన్నారు.